యువ దంపతులకు కౌన్సెలింగ్



గోల్కొండ: కలహాలతోనే కాపురాలు కూలుతున్నాయని తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ నజీబ్ అన్నారు. గచ్చిబౌలికి చెందిన ఓ యువ దంపతులు టోలిచౌకీ అక్బర్‌బాగ్‌లోని ఆర్గనైజేషన్ కార్యాలయంలో ఆయనను కలిశారు. తమకు పెళ్లై నాలుగేళ్లు అయిందని తమ ఇద్దరి మధ్య ప్రతినిత్యం వాగ్వాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. తమ ఇరు వైపుల కుటుంబాల సభ్యులు సైతం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారని ఆయనకు వివరించారు. అయితే కలిసి కాపురం చేసేది దంపతులేనని వారి నిజజీవితంలో కుటుంబ సభ్యుల జోక్యం అవసరం లేదని ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ అన్నారు. కాగా ఈ కౌన్సెలింగ్ వల్ల యువ దంపతులు తాము కలిసి ఉండడానికి కృషి చేస్తామంటూ మహ్మద్ నజీబ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అన్నదానం



గోల్కొండ: ఎటువంటి అవాంతరాలు లేకుండా ప్రభుత్వ ఆసుపత్రుల్లోని రోగులు, వారి సహాయకులకు ప్రతినిత్యం అన్నదానం చేస్తున్నామని ప్రముఖ సంఘ సేవకుడు గోల్కొండ ప్రభుత్వ బాలుర సెకండ్ లాన్సర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. శనివారం ఆయన గోల్కొండ, మెహిదీపట్నం, తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను హైస్కూల్ విద్యార్థిగా ఉన్నప్పటి నుంచి ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో సేవా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి నిర్ణయించుకున్నానన్నారు. అందులో భాగంగానే తాను గత నాలుగు దశాబ్దాల నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానన్నారు.

హరినాథ్ గౌడ్‌కు ఆహ్వానం



ఉప ముఖ్యమంత్రి నుంచి ఆహ్వానాన్ని అందుకుంటున్న గడ్డమీది హరినాథ్ గౌడ్

చార్మినార్: దశాబ్ది వేడుకల్లో పాల్గొనాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి పాతబస్తీకి చెందిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల కన్వీనర్ గడ్డమీది హరినాథ్ గౌడ్‌కు అధికారికంగా ఆహ్వానం అందింది. తెలంగాణ ఉద్యమం సమయంలో ఎన్నో ఉద్యమాలు చేసి అరెస్టై జైలుకు సైతం వెళ్లి వచ్చిన గడ్డమీది హరినాథ్ గౌడ్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ఆహ్వానాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరినాథ్ గౌడ్ మాట్లాడుతూ.. దశాబ్ది వేడుకల్లో పాల్గొనాలని తనకు ఆహ్వానాన్ని అందజేసిన ఉప ముఖ్యమంత్రికి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

రామేశ్వర్ జోషి సేవలు ఎనలేనివి



విజయనగర్‌కాలనీ: ఆలయానికి చిత్త శుద్ధితో నాలుగు దశాబ్దాల పాటు భక్తి ప్రపత్తులతో సేవలందించి, భక్తులకు ఆధ్యాత్మిక దారి చూపిన రామేశ్వర్ జోషి సేవలు మరువలేనివని రామాలయ ప్రధాన అర్చకులు శృంగారపు రాజకుమారా చార్యులు అన్నారు. విజయనగర్ కాలనీ హనుమాన్ ఆలయంలో ప్రధాన అర్చకులు డి.రామేశ్వర్ జోషి పదవీ విరమణ సందర్భంగా దేవాలయ ప్రాంగణంలో ఆత్మీయ సత్కార కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయ శాఖ అధికారులు, అర్చకులు, భక్త బృందం జోషిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ భార్గవ్, జానకి, రామసుబ్రమణ్యం, సంజయ్, రాజిరెడ్డి, పవన్, శివాలయ అర్చకులు శ్రీనివాస శర్మ, అశోక్ జోషి, అనంత చారితో పాటు ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీనివాస శర్మ, భక్త బృందం పాల్గొన్నారు.

బీజేపీ చార్మినార్ కన్వీనర్‌గా ప్రవీణ్‌కుమార్



చార్మినార్: బీజేపీ చార్మినార్ నియోజకవర్గం నూతన కన్వీనర్‌గా సీనియర్ బీజేపీ నాయకుడు షెట్టి ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. గత నాలుగు దశాబ్దాలుగా పార్టీలో క్రియాశీలక కార్యకర్తగా, నాయకుడిగా కొనసాగుతున్న ఆయన గతంలో మొఘల్‌పురా డివిజన్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుల్తాన్‌షాహి డివిజన్ బీజేవైఎం అధ్యక్షుడిగా, బీజేపీ నగర కార్యవర్గ సభ్యుడిగా, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా చార్మినార్ శాసన సభ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్‌గా పని చేసిన తాను పండిత్ దీన్‌దయాళ్ సంచాలన్ సమితి చార్మినార్ ఇన్‌చార్జిగా ఉన్నానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో తనకు ఈ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపారు.

పాఠ్య పుస్తకాల పంపిణీ



యాకుత్‌పురా: ప్రభుత్వ పాఠశాలకు అవసరమైన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామని విద్యాశాఖ చార్మినార్ జోన్ డిప్యూటీ ఈఓ ఐ. నెహ్రూ బాబు తెలిపారు. శనివారం ఆయన జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు నూతన విద్యా సంవత్సరానికి చెందిన పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ఏడాది తమ జోన్ పరిధిలోని 16 ఉన్నత పాఠశాలలు, 30 ప్రైమరీ పాఠశాలలకు ప్రభుత్వం అందజేసిన పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశామన్నారు. నూర్‌ఖాన్ బజార్ జీజీహెచ్‌ఎస్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అలివేలు మంగా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతబస్తీలో చెక్ పోస్టులు ఏర్పాటు



చార్మినార్: బక్రీద్ ను పురస్కరించుకుని పాతబస్తీలోని పలు ప్రాధాన కూడళ్లల్లో దక్షిణ మండలం పోలీసులు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా జంతువులను రవాణా చేస్తే.. తనిఖీలు నిర్వహించి ఏవైనా పొరపాట్లు ఉంటే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నామని మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వర్ రావు తెలిపారు. తమ ఏసీపీ పరిధిలో మీర్‌చౌక్ పోలీసు స్టేషన్ పరిధిలోని సాలార్‌జంగ్ మ్యూజియం రోడ్డులో, రెయిన్‌బజార్ పీఎస్ పరిధిలోని డబీర్‌పురా బ్రిడ్జి వద్ద చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆవులు, దూడలను ఎట్టిపరిస్థితుల్లో రవాణా చేయరాదన్నారు. ఇక ఎడ్లను తరలించేటప్పుడు సంబంధిత పశు వైద్యుని ధ్రువీకరణ పత్రం వెంట ఉండాలన్నారు. మీర్‌చౌక్ ఇన్‌స్పెక్టర్ రాచకొండ రవీందర్ మాట్లాడుతూ.. నిరంతరం తనిఖీలు కొనసాగుతాయన్నారు.

వైభవంగా రంగనాథ రథోత్సవం

జియాగూడ: చారిత్రాత్మకమైన జియాగూడ రంగనాథస్వామి దేవస్థానంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారం ఉత్సవాల్లో భాగంగా స్వామివారి రథోత్సవం ఆలయం నుంచి పురానాపూల్ వరకు కొనసాగింది. అడుగడుగునా స్వాగత వేదికలపై నుంచి రథానికి స్వాగతం పలికారు. అంతకు ముందు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రీదేవి భూదేవి సమేత రంగనాథ స్వామి పల్లకీ సేవతో రథంపై విగ్రహాలను ఏర్పాటు చేశారు. మేళ తాళాలతో, డప్పు వాయిద్యాలతో విద్యుత్ దీపాల అలంకరణ మధ్య రథోత్సవం ప్రారంభమైంది. ఆలయ ట్రస్టీ ఎస్‌టీచారి, ప్రతినిధి శేషాచారి, ప్రధాన అర్చకులు శ్రీనివాస రంగనాథ చారి ఆధ్వర్యంలో రథోత్సవం కొనసాగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శంకర్ యాదవ్, బొట్టు రామ్, డీవీఎస్ రాజు, గూడుమని చంద్రకాంత్. బద్రినాథ చారి, నరహరిచారి, మదిర సత్యనారాయణ, జె.లక్ష్మీనారాయణ, సుదర్శన్ ముధిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



రంగనాథుడి రథోత్సవ ఊరేగింపు



పల్లకీ సేవ



ఊరేగింపులో కార్పొరేటర్ శంకర్ యాదవ్, డీవీఎస్ రాజులు తదితరులు



సింగాడి మేళం డప్పు వాయిద్యం

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేస్తేనే మంచిదని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలోని టోలిచౌకీ, గోల్కొండ, లంగర్‌హౌజ్ తదితర డివిజన్లలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. సాలర్‌జంగ్ కాలనీలో డ్రైనేజీ పనులను చూసి ఆయన కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన ఎండి లైన్స్ చౌరస్తా, లంగర్‌హౌస్ హెచ్‌ఎండీఏ పార్కు తదితర ప్రాంతాల్లో జరుగుతున్న డ్రైనేజీ పనులను కూడా పరిశీలించారు. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో జరుగుతున్న పనులను తాను ప్రతినిత్యం పరిశీలించి వాటిపై ఒక నివేదికను తయారు చేస్తానని ఆయన అన్నారు. ఈ నివేదికను సంబంధిత శాఖ ఉన్నతాధికారులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఆయన వెంట కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్జమా సిద్ధిఖి తదితరులున్నారు.

కార్వాన్‌లో పర్యటించండి..

కార్వాన్‌లో పర్యటించి ఈ ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ బల్దియా కమిషనర్ రోనాల్డ్ రాస్‌ను కలిశారు. శనివారం ఆయనను కలిసి కార్వాన్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు తనను తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయని అన్నారు. గత నాలుగు నెలలుగా బల్దియాకు చెందిన ఏ ఒక్క అధికారి కూడా పనులను పరిశీలించలేదన్నారు. అధికారుల నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన అన్నారు. పైప్‌లు వేయడానికి రోడ్లను తవ్వి పనులు మధ్యలోనే వదిలేశారని ఆయన కమిషనర్‌తో చెప్పారు. అదే విధంగా బల్దియా స్ట్రీట్ లైట్ల విభాగం వారు తమను తాము పెద్ద అధికారులమంటూ వ్యవహరిస్తున్నారని ఫోన్‌లు చేస్తున్నా నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఒకసారి పర్యటిస్తే ఇక్కడ ఆగిపోయిన పనుల విషయం స్వయంగా చూడవచ్చునని ఆయన అన్నారు. కాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేయిస్తానని ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ అన్నారు. త్వరలోనే తాను కార్వాన్ నియోజకవర్గంలో పర్యటిస్తానని ఆయన హామీ ఇచ్చారు.



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా

యాకుత్‌పురా: సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా సూచించారు. పురానీహవేలీలోని కోర్టు మొదటి అంతస్తులో గుండెపోటు సంభవించినప్పుడు తీసుకోవాల్సి అత్యవసర ప్రథమ చికిత్స, కేన్సర్ వ్యాధులపై న్యాయశాఖ అధికారులు, ఉద్యోగులకు యశోదా ఆసుపత్రి, ఎంఎన్‌జే ఆసుపత్రుల సౌజన్యంతో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీపీఆర్‌పై సికింద్రాబాద్ యశోదా ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గిరిధర్, డాక్టర్ వినీత్ వివరించారు. అదే విధంగా కేన్సర్ వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రికి చెందిన వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాసులు వివరించారు. ఈ సందర్భంగా చీఫ్ జడ్జి రేణుకా యారా మాట్లాడుతూ.. అధికారులు, ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా వైద్యా ఆరోగ్య శాఖ డీఎం అండ్ హెచ్‌ఓ డాక్టర్ వెంకటి, యశోదా ఆసుపత్రి ప్రముఖ కార్డియాజిస్ట్ డాక్టర్ సీతాల్, న్యాయశాఖ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి విగ్రహాన్ని తస్కరించిన నిందితుడి అరెస్టు

అబిడ్స్: ఆలయంలోకి ప్రవేశించి అమ్మవారి విగ్రహం, పూజా సామగ్రిని తస్కరించిన నిందితుడిని గుడిమల్కాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. సౌత్ వెస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ మహ్మద్ అశ్వక్, ఇన్‌స్పెక్టర్ బైరి రాజు విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్న మహేష్ (24) ఈసీఐఎల్ ప్రాంతంలో నివసిస్తున్నారన్నారు. గత నెల 30న కార్వాన్‌లోని హరిదాస్‌నగర్‌లో ఉన్న ఆలయంలోకి ప్రవేశించి కనకదుర్గ అమ్మవారి విగ్రహంతో పాటు పూజా సామగ్రిని తస్కరించారు. పోలీసులు కేసు నమోదు చేసి ఈసీఐఎల్ ప్రాంతంలో ఉన్న మల్లాపూర్‌లో అతడిని అరెస్టు చేశారు. నిందితుడి వద్ద విగ్రహ పూజా సామగ్రిని స్వాధీన పరచుకున్నారు. నిందితుడు ఒక కత్తిని దగ్గర పెట్టుకుని ప్రజలను కూడా భయపెట్టిస్తున్నారన్నారు. కత్తిని సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఎస్ఐ.రాజేందర్ సాంగి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి



చాంద్రాయణగుట్టలో..



లక్డీకపూల్ హనుమాన్ ఆలయంలో..

చాంద్రాయణగుట్ట: హనుమాన్ జయంతి సందర్భంగా చాంద్రాయణగుట్టలోని చెన్నకేశవ స్వామి ఆలయ ఆవరణలోని చతుర్భుజ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ జుర్కి సంతోషి రాణి, ఈవో శివ రుద్రప్పల పర్యవేక్షణలో పూజారీ ప్రతాపాచార్యులు అభిషేకం, అర్చన తదితర పూజలను కొనసాగించారు. కేశవగిరి, కుమ్మర్‌వాడీల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. స్థానిక నాయకులు రాజేందర్ కుమార్, సాయి, రవి పాల్గొన్నారు.

అబిడ్స్: లక్డీకపూల్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి వరకు భక్తులతో ఆలయం కిక్కిరిసింది. ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

దశాబ్ది వేడుకలకు పాతబస్తీ ముస్తాబు

చార్మినార్: తెలంగాణ దశాబ్ది వేడుకలకు పాతబస్తీ ముస్తాబయ్యింది. జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ కార్యాలయ పరిధిలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది తెలంగాణ దశాబ్ది వేడుకలను ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. అలాగే పోలీసు, జలమండలి, ఆర్టీఏ తదితర ప్రభుత్వ విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు ఆదివారం ఉదయం జరగబోయే పతాకావిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. పాతబస్తీలోని ప్రధాన కూడళ్లల్లో రంగు రంగుల విద్యుద్దీపాలంకరణ చేశారు. ఆయా ప్రాంతాల్లోని బస్తీలతో పాటు పరిసర ప్రాంతాలన్నింటినీ పారిశుద్ధ్య సిబ్బంది శుభ్రం చేశారు.

నేడు చార్మినార్ వద్ద..

చార్మినార్ కట్టడం వద్ద రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 8 గంటలకు దశాబ్ది వేడుకలను నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేసినట్లు కమిటీ చైర్మన్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు జి.నిరంజన్ తెలిపారు. ముందుగా చార్మినార్ భాగ్యలక్ష్మి ఆలయంలో అమ్మవారికి పూజలు నిర్వహించిన అనంతరం చార్మినార్ వద్ద పతాకావిష్కరణ చేయనున్నామన్నారు.

సన్మానం



మంత్రి దామోదర రాజ నర్సింహను సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహను తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. దర్జీలను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. 30 ఏళ్లకు పైగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రజా సేవ చేస్తున్న తనకు మేరు సంఘం కార్పొరేషన్ పదవి అప్పగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిమూలం శంకర్, పోల్కం వినయ్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న తూంకుంట అరుణ్‌కుమార్ తదితరులు

అబిడ్స్: ఈ నెల 4న ఎన్నికల కౌంటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి ఫలించాలని రాష్ట్ర కురుమ యువజన సంఘం అధ్యక్షుడు తూంకుంట అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన కృషితోనే రాష్ట్రంలో 12 నుంచి 14 సీట్లు కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందన్నారు. యాదాద్రి ఆలయంలో తూంకుంట అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ మాట్లాడుతూ..గత 5 నెలల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ప్రగతి, సంక్షేమం, అభివృద్ధితోనే విజయం సాధిస్తామన్నారు. కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందన్నారు.

అమరవీరులకు నివాళి



కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు, సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్/నాంపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అమరవీరులకు నివాళులర్పించారు. శనివారం గన్‌పార్కు వద్ద అమరవీరులకు ఎమ్మెల్సీ ప్రభాకర్‌రావు, నాంపల్లి నియోకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి సీహెచ్. ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో నివాళులర్పించి సంబరాలు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. ఆయన కృషితోనే తెలంగాణ దేశంలోనే నెంబర్:1 గా మారిందన్నారు.

గౌలిపురా ఆరె కటిక సంఘం ఎన్నికలు నిర్వహించాలి

గౌలిపురా: గౌలిపురా ఆరె కటిక సంఘంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలి మాజీ కార్యదర్శి ఎ.భానుప్రకాశ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రతి మూడేళ్లకు ఒకసారి ఆరె కటిక సంఘం ఎన్నికలు నిర్వహించుకోవాలి కానీ గౌలిపురా ఆరె కటిక సంఘంలో 11 ఏళ్లు దాటినా ఎన్నికలు నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. కావున వెంటనే సిక్రెట్ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు జరిపించి ఆరె కటిక సమాజ కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. ఈ మధ్య సిక్రెట్‌గా ట్రస్ట్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారని, వారికి అనుకూలంగా ఉన్న 13 మందితో ఒక గ్రూపును ఏర్పాటు చేసుకొని ట్రస్ట్ చేయాలని ట్రస్ట్‌లో 12 మంది సభ్యులు ఉండాలని నిర్ణయించారన్నారు. ఈ ట్రస్ట్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నీలం సంజీవరెడ్డికి ఘన నివాళి



అబిడ్స్: మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి వర్ధంతి ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మనిలాల్‌షా, ఉపాధ్యక్షుడు కుమార్‌రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం ఆయన చేసిన సేవలు కొనియాడారు.

ఆషాఢ మాసం బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



సర్వసభ్య సమావేశంలో గాజుల అంజయ్యతో పాటు పాల్గొన్న పలు ఆలయాల కమిటీ ప్రతినిధులు

చార్మినార్: భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ నూతన చైర్మన్‌గా గాజుల అంజయ్య శనివారం రాత్రి బాధ్యతలు చేపట్టారు. 2023లో చైర్మన్‌గా కొనసాగిన ఆలె భాస్కర్ రాజ్ వివిధ ఆలయాల కమిటీ ప్రతినిధుల సమక్షంలో గాజుల అంజయ్యకు బాధ్యతలు అప్పగించారు. శనివారం రాత్రి గౌలిపురాలోని భారత మాత, కోట మైసమ్మ ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఈ కార్యక్రమం జరిగింది. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రతినిధులు గతేడాది జరిగిన ఉత్సవాల విశేషాలతో పాటు ఈ ఏడాది చేపట్టాల్సిన పూజా కార్యక్రమాలపై ప్రసంగించారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన గాజుల అంజయ్యను పలువురు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈసారి ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి తగిన కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మల్లేష్ గౌడ్, రాకేష్ తివారీ, కె.ఎస్.ఆనంద్ రావు, జనగామ మధుసూదన్ గౌడ్, మధుసూదన్ యాదవ్, అనంతోజ్ హన్స్‌రాజ్, రాజేష్, బుల్లెట్ శ్రీధర్, కై లాస్, ఆదర్శ మహేష్, ప్యారసాని వెంకటేష్ పాల్గొన్నారు.



